కథానిక

# మానవత్వం

కనమలూరు విశ్వనాథం

"మురహరి అదోరకం మనిషి. మొట్టమొదట అతను నాకు కాలేజీలో పరిచయమయ్యాడు. మానవుల జీవిత పథంలో విద్యార్థి దశ-హాయి, సంతోషాన్ని యిచ్చే చల్లని కొబ్బరి తోట. అందులో మరీ కాలేజి వాతావరణం అమితమైన ఉత్సాహం, సంతోషం చేకూరుస్తుంది మనస్సుకి.

ప్రతి దినమూ సాయంత్రంవేళల్లో మురహరి నేను, ఇంకా కొంతమంది మిత్రులమంతా షికారు వెళ్లేది నిర్జనమైన తారు రోడ్డు మీదుగా. ఒకనాడు మా కెదురుగా యౌవనం తొంగిచూచే చింపిరి గుడ్డలతో ఒక అమ్మాయి తన ముసలి తాతను నడిపించుకొంటూ మెల్లగా వస్తూవున్నది. మేమూ చూస్తూనే ఉన్నాము. ముసలాడు దభీమని పడ్డాడు నేలమీద, కాళ్లూ చేతులూ ముందుకు వెనక్కు నిగ్గుతున్నాయి. అమ్మాయికి దిక్కు తోచకుండా తాత పొట్టలో తల దూర్చి వెక్కి వెక్కి యేడుస్తూవుంది. పరిగెత్తాం అందరమూ. ముసలాడి నోటిలోంచి చొంగ నురుగు కారుతూంది. పిల్లదాని ఒళ్లంతా వణుకుతోంది దుఃఖము, దైన్యము, నిస్సహాయతతో. మాకు తెలిసిన ప్రథమ చికిత్సలు చేసి, తాతకి తెలివొచ్చే వఱకూ అక్కడనేవుండి ఆపైన అడిగాము పిల్లని మీ రెవరని. "నాకు బుద్ధి తెలిసినప్పట్నుంచీ ఈ తాతనే నాకు తెలుసు. పొట్టగడవకుండా, పనిచేయడానికి శక్తి ఉత్సాహాలు లేకుండా రోజూ టవున్లో యాచిస్తాము...అదో అక్కడకనపడే పూరిగుడిశే ఈదౌర్భాగ్యులుండే స్థలము." అని ఆగి ఆగి చెప్పింది దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ. ఇక పూళ్లోకి పోకండి అనిచెప్పి మా దగ్గరున్న డబ్బంతా పోగుచేసి ఐదు రూపాయిలు వాళ్ల కిచ్చాం.

దీంతో మురహరి పూర్తిగా మారాడు. ఆ అనాథలైన ముసలాడు, పిల్ల—వీళ్ల స్థితికి మేము అంతాకూడా చాలా నొచ్చుకొని సానుభూతి రూపకంగా తలకొక నాలుగు డబ్బులతో సహాయపడినా, మాకా విషయం మామూలుగానే తోచింది. అయితే మురహరిలో మాత్రం ఒక బలవత్తర పరిణామాన్ని లేవదీసింది. విధి విరామాలు లేకుండా, గంటలకొద్దీ మా డిస్కషన్సులో పాల్గొని, వాదించే అతడు అప్పటినుంచి మితభాషిగా తయారయ్యాడు. ఎప్పుడూ, ఏదో ఆలోచిస్తున్నట్టుకూడా కనపడేవాడు.

కేవలము మాటలలోనే కాకుండా మురహరి తన వేషంలో, చేష్టల్లోకూడా మారిపోయాడు. కోట్లు, బుష్‌కోట్లు వేసేవాడు మామూలుగా. ప్రస్తుతం షర్టు, పాంటుమాత్రము వేయసాగాడు. కాబూల్ సాండల్స్ షైకుస్ బూట్లకు బదులు ఇప్పుడు బాటాస్లిప్పర్లు. రాత్రుల్లో పాలు త్రాగటం లేదు. సినిమాలకు తఱచుగా వెళ్లటంలేదు. పోయినా ఫస్టు క్లాసుకు వెళ్ళడంలేదు పదణాల క్యూలో నిలబడతాడు. ఇదంతా గమనించిన మా స్నేహిత వర్గం అతన్ని పిసినారిబంకగా తయారయ్యాడని అనుకొంది. ఒకప్పుడు అతన్ని యిలా మారిపోయ్యావేమని గలాటా చేస్తే, "నేనిప్పుడు నిషేధించిన ఖర్చులు అన్నీకూడా నాకు అనవసరమైనవి. మన దేశములోని సామాన్య మానవుని మోతాదుకు మించిన పని నాకు జ్ఞానోదయం కలిగించి. లోకంలో మన యిరుగు పొరుగు వారికిగూడా యిటే రకంగా అవసరాలు తీరి, జీవిత పరిమాణము ఇంతకువస్తే ఆదే పదివేలు. అయితేమాత్రం నేను డబ్బు నిల్వ చేయటం లేదని గుర్తించుకోండి. మానాన్న ప్రతి నెలా పంపే డబ్బులో రవ్వంతైనా తగ్గించి పంపమని నేను వ్రాయలేదు. అంతా తీసుకొని, నాకుమిగిలిందంతా నాకు కనబడిన బీదలకిస్తున్నా. బట్టలు నాకు కావలసినవి కొనుక్కొనేటప్పుడంతా రెండు జతలు పంచలు, చొక్కా

బట్టలు కొని రోడ్లమీద నగ్నంగా తిరుగాడే అనాథలకిస్తున్నా. నేనింతవరకు రాత్రుళ్లు త్రాగే పాలకై ప్రతినెలా పది రూపాయలు ఖర్చుపెట్టేవాణ్ణి ఇప్పుడా పదిరూపాయలూ పదిమంది పసిపాపలకిచ్చి [దిక్కులేని బీద పిల్లలకు] పాలు కొనుక త్రాగండని చెప్తున్నా. సినిమాకు వెళ్లేటప్పుడంతా, థియేటర్ల ముందు కేవలం బయట వ్రేలాడగట్టిన బొమ్మలనుమాత్రం చూస్తూ, అప్పుడప్పుడు కార్లలోనుండి దిగి, రిజర్వుడు క్లాసులకు వెళ్లే 'పిక్చర్ గోయర్'లను చూస్తూ తృప్తిచెంది బిక్క మొగాలతో వెళ్ళిపోయే దౌర్భాగ్యులను ఇద్దరిని, ముగ్గురిని నాతో తీసుకపోయి, సినిమా చూపిస్తున్నా... మీరుకూడా ఆమాత్రం చేస్తే...'' అని చెప్తూ టక్కున ఆగాడు మురహరి, గొంతులో మాట పెగలక. పాపం అతని హృదయం విపరీతంగా ద్రవీభూతమయిపోయింది.

ఈ విధంగా ఉండేవాడు కాలేజీ దినాల్లో. నాలుగేళ్లు గడిచిపోయాయి. నేను లా కాలేజీలో చేరాను. మురహరి మాత్రం లా చదవడానికి ఒప్పుకోలేదు. అతని తండ్రి అంతో ఇంతో ఉన్నఆసామి; ఊరిలో పరువు ప్రతిష్ఠలతో బతికినవాడు. అంచేత కొడుకును ప్లీడరీ చదవమని చాలా నొక్కాడు. కొడుకుమాత్రం మొండిపట్టు పట్టాడు చదవనంటే చదవనని. ట్రెయినింగు అయి టీచరవుతానన్నాడు. లేకపోతే అంతటితో విరమిస్తానన్నాడు. తనూ ఒక లాయరైతే అబద్ధాలు, అన్యాయాలు చెప్పి, చేసి డబ్బు సంపాదించవలసి వస్తుందని, అట్లా తలకుమించిన ధనం తనవద్ద కేంద్రీకరింపబడితే, దాని ఫలితంగా ఎంతోమంది చావవలసి వస్తుందని, డబ్బుకారణంగా పేదలమీద తనకు దయాదాక్షిణ్యాలు శూన్యమౌతాయనిన్నీ మా కందరికీ చెప్పాడు. టీచరైతే, మామూలుగా నిరాడంబర సామాన్య జీవితాన్ని గడపటానికి వీలుంటుందని అభిప్రాయపడ్డాడు; తండ్రి విధిలేక ఒప్పుకొన్నాడు. ఆ కాస్త ట్రెయినింగు అయినతర్వాత తన వూళ్లోనే ఒక టీచరుగా చేరాడు. నేను ఆదేసంవత్సరంలో వాళ్లవూళ్లోనే ప్రాక్టీసు పెట్టాను అడ్వొకేటుగా.

'ఆ తర్వాత ఏం జరిగింది మీకే తెలుసు! సంగ్రహంగా చెప్తా. టీచరైన తర్వాత కూడా అతను పేదలమీద ఇతోధిక ప్రేమ, ఆదరణతో ప్రవర్తించాడు. రాత్రి పాఠశాలలు ప్రారంభించి, రాత్రి పది, పదకొండు గంటలవరకూ హరిజన బాలురకి, తక్కిన బీద పిల్లలకి విద్య శ్రద్ధతో గఱపాడు. తనకు నెల ప్రారంభంలో ముట్టే జీతంలో సగానికి పైగా జీతం కట్టలేని బీదవిద్యార్థులకి పుస్తకాలకు, జీతాలకు, బట్టలకు ఇచ్చేస్తూ వచ్చాడు. తన్నై పేదకారుణ్య సంఘము అని ఒక సంఘాన్ని స్థాపించాడు. ఈ సంఘములో ధనికులనంతా సభ్యులుగా చేర్పించాడు. శని ఆదివారాల్లో చందాలకై ఎండలలో, వానల్లో ఊరూరా తిరిగేవాడు. వీలైనన్ని పబ్లికు మీటింగులు యేర్పాటుచేసి, అందరిని ధారాళంగా భూరివిరాళాలతో తన సంఘానికి తోడ్పడవలసిందిగా కోరుతుండేవాడు.

మురహరి పేరు, అతని సంఘం, దాని సేవ చుట్టుపక్కల గ్రామాల్లో, పట్టణాల్లో నడిసముద్రంనుండి వచ్చే ఎత్తైన అలలవలె వ్యాపించింది; మారుమ్రోగింది. నిర్మలంగా గట్టువరకూ వెళ్లే అలలు తిరిగి వెనక్కు వచ్చేటప్పుడు ఒడ్డున నుండే మురికి, కల్మషము తీసుకవస్తాయి. అదే విధంగా మురహరి కీర్తి, అతని సంఘం ప్రతిష్ఠలకిగూడ తటాలున అనుకోకుండా ఒక కళంకం వచ్చింది. పుకారులకోసం, అపోహ, అపవాదులకోసం కాచుకొనివుంటుంది లోకం. ఏదైనా ఆధారం-ఆహారం-దొరికితే నిజమా, అబద్ధమా అని విచారించే మానవ సహజ స్వభావంగూడ తప్పిపోతుంది ఆ ఆకలి తీవ్రతల్లో. ''మురహరి బాబు గమ్మత్తుగా యీ సంఘాన్ని లేవదీసి, డబ్బు వసూలు చేసి, చాలవరకు స్వార్థానికి వినియోగపరచుకొంటున్నాడు. లేకపోతే, యిందరుండగా, యిప్పుడీయనకేమొచ్చి పడింది'' అని చెప్పుకో సాగారు ఆడాళ్లు మొగాళ్లు గుసగుసల మరుగులో - రచ్చలక్రింద, కొళాయీల దగ్గర.

రన్నింగ్ రేస్‌కు సిద్ధంగావుండే వ్యక్తిని ఉత్సాహపరిస్తే తన గమనవేగాన్ని ద్విగుణీకృతం చేయగల్గి, జయంపొందుతాడు. 'నువ్వు గెలవలేవు, నీకు శక్తిలే' దని చచ్చుమాట ఒకటి చెప్తేచాలు పడిపోతాడు మధ్యలోనే అధైర్యం ఫలితంగా. ఇది మానవ స్వభావం. అకారణంగా, నిరాధారంగా తనకు వచ్చిపడ్డ యీ అప

నింద మురహరి చెవుల్లోనూ పడ్డది. కుమిలి పోయాడు అవమానంతో, ఎండలో వేసిన నల్లి వలె. దుఃఖం, నైరాశ్యం ప్రబలింది అతని నాడుల్లో విద్యుచ్ఛక్తి ప్రవాహం మల్లే. ఆ తీవ్ర భారానికి దారుణమైన జ్వరాలు వచ్చాయి; ఎంతమంది డాక్టర్లు మందులిచ్చినా ఉపయోగం లేక యీ కుళ్లు సంఘాన్ని, లోకాన్ని వీడి పోయాడు మురహరి.

అతడు నిజమైన మానవ సేవకుడు. యీ లోకంలోని మిట్టపల్లాలు, హెచ్చుతగ్గులు అర్థం చేసుకొని, దయ సానుభూతి పశ్చాత్తాప అనుభూతులలో జీవితాన్ని గడపిన అమరజీవి. అతనికి చేసిన అన్యాయం, అపకారానికి మీరంతా పశ్చాత్తాపపడితే, మీరంతా ఆయన భావాలకి ఒక రూపం కల్పించడంకోసం ఒక సంస్థను లేవదీస్తే బాగుంటుంది. భూరి విరాళాలిచ్చి తోడ్పడండి" అని ప్రీడరు రామారావు గంభీరోపన్యాసమిస్తే, సమావేశమైన మేమంతా భారమైన హృదయాల్తో విన్నాము.

# ★ తిరిగి వచ్చిన శశి ★

దండమూడి మహీధర కుమార్

నేనింకా నిద్రనుంచి లేవలేదు. మంజు వచ్చి లేపింది. మంజుమీద కోపం వచ్చింది-మళ్లా ముసుగు పెట్టుకున్నాను. కప్పుకున్న శాలువా లాగేసి 'ఎవరో వచ్చా'రన్నది. కళ్లు తెరవటానికి యత్నించాను. రాత్రి చాలా ప్రొద్దుపోయేంత వరకూ మేల్కొని ఏదో రాసుకోవటం వల్ల ఉదయం మెలుకువ వచ్చిందే కాదు. ఎవరో వచ్చారనేప్పటికి లేవాలని ఎంత యత్నించినా బద్ధకం నన్ను లేవనీయటం లేదు. ఎదురుగా నిల్చున్న మంజు అలా చూస్తోంది - నవ్వుతూ! 'మంజూ! ఆ వచ్చిన వ్యక్తితో ఇంకో గంట ఆగి రమ్మని చెప్పు-నాకు చాలా బద్ధకంగావుంది- అన్నాను. 'ఆ వచ్చింది ఎవరో స్త్రీ' అనేప్పటికి నాకు ఎక్కడ లేని భయం పుట్టుకొచ్చింది. ఉదయానికి ఉదయాన - ఎనిమిదన్నా కాలేదు ఎవరో రావటం, ఆ వచ్చినది ఒక స్త్రీ అవటం నన్ను పలురకాలైన ఆలోచనల్లో నింపింది. అన్నాను— 'మంజూ, వెళ్ళి ఇప్పుడే వస్తానని చెప్పు-మొహం కడుక్కొని వస్తాను.'- మంజు వెళ్ళిపోయింది.

బద్ధకంగా లేచి పెరట్లోకి వెళ్ళ బోతుండగా ఆ వచ్చింది ఎవరో అనే భావం రావటంతో నాకు భయమేసింది. ఎవరై వుండొచ్చు? ఇంత ఉదయం ఎవరు రాగలరు? ఊళ్లో ఎవరూ స్నేహితురాళ్లు లేరు. మంజుకా అంటే కాదు. ఇలా ఆలోచించి పెరట్లోకి వెళ్ళబోయే నేను డ్రాయింగు రూం ప్రక్క గదిలోకి వెళ్లాను. ఆ వచ్చిన వ్యక్తి మంజుతో మాట్లాడుతోంది - గొంతునుబట్టి పోల్చుకో గలిగాను - భయం ప్రతి అవయవంలోనూ ప్రవేశించి నన్ను నిర్జీవుణ్ణి చేసింది. ఆమె ఎందుకొచ్చిందో అర్థంకాక ఎంతో తికమక పడ్డాను.

ఆమె శశి.

"నువ్వు మధుభార్యవా? అయితే నీవుఅదృష్టవంతురాలివి! మధు చాలా సహృదయుడు. అతనికి భార్యగా వుండి నీవెన్నో చేరచ్చోగలుగుతావు. నీభవిష్యత్తు ఉజ్వలమైంది. మీ దాంపత్యం నిత్య వసంతంగా వంద నందనవనాలకి ఆలవాలం కావటమే నా అభిమతం'- అయితే మంజూ, మధు ఇంకా రానేలేదు-నే వెళ్తాను! మధుతో చెప్పు, నా పేరు శశి. నెల్లూరునుంచి వస్తున్నాను. నిన్ను చూడగలిగేను, అనుకోకుండా - అదే నా సంతోషం. వెళ్లొస్తాను.'

ఈ మాటలు విన్నాక అలాగేబయటికి రావాలనుకున్నా. కాని నాలో ఆ సాహసం లేక పోయింది.

'ఇప్పుడే రావటం ఇప్పుడే వెళ్ళటం - ఇదేం సభ్యత!' అంటోంది మంజు.

'సరే, మధు వచ్చేంత వరకూ వుంటాను. పెళ్ళికి పిలిచేడేకాదు! కనీసం ఇప్పుడేనా అభినందన లందజేస్తాను' అన్నది శశి.